క్లుప్తంగా

ఎమ్మెల్యేలకు ఎస్ఐఓ ఉగాది శుభాకాంక్షలు


ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు

మార్కాపురం: ఉగాది పండుగను పురస్కరించుకుని జమాతే ఇస్లామి హింద్, ఎస్ఐఓ మార్కాపురం శాఖల ప్రతినిధులు మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డికి శుభకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సోదర భావంతో మెలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు అష్రఫ్ అలీ, సికిందర్, ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్, ఖాలీద్, నజీర్, సలీం, అయూబ్‌ఖాన్, కాశీంబాషా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్రిపురాంతకేశ్వర స్వామి గ్రామోత్సవం


ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

త్రిపురాంతకం: ఉగాది పండగ సందర్భంగా శ్రీ పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి గ్రామోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకంలోని శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి గ్రామంలో ఊరేగించారు. గ్రామోత్సవం సందర్భంగా చిన్నారులు కోలాటం ఆడుతూ ఉత్సవాన్ని ముందుకు నడిపించారు. స్వామి వారి విడిది గృహం వద్ద నైవేద్యం సమర్పించి అర్చకుడు విశ్వనారాయణశాస్త్రి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామోత్సవం ఏర్పాట్లను ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ పద్మజ మల్లికార్జునరావు పర్యవేక్షించారు. అనంతరం గ్రామంలో పంచాంగ శ్రవణం చేశారు.


గ్రామోత్సవానికి హాజరైన భక్తులు

వైభవంగా నగరోత్సవం

చీమకుర్తి: మారం వంశీకుల ఆధ్వర్యంలో బుధవారం చీమకుర్తిలో సాక్షిరామలింగేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామి విగ్రహాల నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇసుకవాగులోని సాక్షి రామలింగేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామిని ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారం వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, కోటా రాములు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


కంభంలో స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న పండితుడు


గొట్లగట్టులో ఉగాది పచ్చడి పెడుతున్న మహిళ


చినమనగుండంలో బొల్లావుల ఊరేగింపు

శోభకృత్ నామ సంవత్సరం..
షడ్రుచుల సమ్మేళనం

ఉగాది పర్వదినాన్ని మార్కాపురం, గిద్దలూరు, దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. శోభకృత్ నామ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని శాస్త్రం చెబుతోందని పండితులు పేర్కొన్నారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేసి ఉగాది పచ్చడి పంచిపెట్టారు.

- ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేసిన పండితులు
- తెలుగు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు, అధికారులు
- గొట్లగట్టు, చినమనగుండంలో కాటంరాజుకు పూజలు


పెద్దారవీడు: ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి


ముస్తాబైన వెంకట్రామయ్యస్వామి

కొనకనమిట్ల/పొదిలి రూరల్/తర్లుపాడు: కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. రైతులు ఎడ్లతో ఉత్సాహంగా ఏరువాక సాగారు. ప్రజలు తమ ఇష్టదైవాలకు ఒక్క పొద్దులు ఉండి నైవేద్యం సమర్పించి, పూజలు చేశారు.

కాటంరాజు స్వామికి పూజలు

చినమనగుండం గ్రామంలో కాటంరాజు స్వామి, గంగాభవానికి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని స్వామివారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. బుధవారం సాయంత్రం కాటంరాజుకు కుంకుమ బండ్లు కట్టి బొల్లావులతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఏడాది ప్రకృతి అనుకూలించి, పాడి పంటలతో గ్రామం బాగుండాలని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గొట్లగట్టు కొండపై వేనూతల కాటంరాజు ఆలయంలో శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. గ్రామంలో ఉత్సవం అనంతరం స్వామివారికి పొంగళ్లు పెట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

= పొదిలి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

= తర్లుపాడులోని వేణుగోపాల స్వామి ఆలయం, కేతగుడిపిలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ప్రసాద్‌శర్మ, పవన్‌శర్మ పంచాంగ శ్రవణం చేసి, భక్తులకు ఉగాది పచ్చడి పంచిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ అంకమ్మ, ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కర్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు జగన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: శోభకృత్ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం ఉగాది పండగను గ్రామాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలో గాంధీ కళాక్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘ సభ్యులు హనుమంతరావు, గురునాథం ప్రారంభించారు. భక్తులు ఉదయాన్నే దేవాలయాలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ సభ్యులు బాలరామాంజనేయులు, సీహెచ్ సుబ్బారావు, డిష్ చిన్నా, మాజీ ఎంపీటీసీ యిదెమ్మ, వాసు, సత్యం, వీరాంజనేయులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: ఉగాది పండగను పురస్కరించుకుని మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొంద్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీ ప్రసాద్ స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, పూలమాల, అభరణాలు అలంకరించి భక్తులకు దర్శమిచ్చారు. గ్రామాల్లో అర్చకులు సీతారామచంద్రస్వామి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లకు దర్శించుకొని నైవేద్యం, కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కంభం: ఉగాది పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సంగా వీధిలోని రంగస్వామి ఆలయంలో సాయంత్రం స్వామి వారి కల్యాణం జరిపించారు. భక్తులు సతీ సమేతంగా కల్యాణంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ ఏడాదిలో మొదటి పండగ ఉగాది కావడంతో పిల్లా పాపలు కొత్త దుస్తులు ధరించారు. రైతులు తెల్లవారు జామున ఏరువాక సాగించారు. ఈ ఏడాది పాడిపంటలు సంవృద్ధిగ పండాలని, పిల్లాపాపలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ ఆలయాల్లో పూజలు చేశారు. వేప పూతతో ఉగాది పచ్చడి చేసి అందరికీ పంచిపెట్టారు. ఆలయాల్లో పూజారులు వేదమంత్రాలు చదివి పంచాంగం శ్రవణం చేశారు.

తాళ్లూరు: శోభకృత్ నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. గుంటి గంగా భవాని, మాధవరం స్వామి, సోమేశ్వరస్వామి, ఆగస్త్యేశ్వర ఆలయం, వేణుగోపాలస్వామి, సోమవరప్పాడు ఆంజనేయ స్వామి, వెంకట్రామయ్య స్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. బొద్దికూరపాడు మాధవ స్వామి ఆలయంలో కృష్ణారావు (రమణయ్య), లక్కవరంలో ప్రకాశరావు పంతులు, అంగస్త్యేశ్వర స్వామి వద్ద శర్మ ఆధ్వర్యంలో గుంటి గంగా ఆలయం వద్ద పంచాంగ శ్రవణం చేసి ఉగాది పచ్చడి పంచి పెట్టారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈఓ భాస్కర్‌రెడ్డి ఆలయాల వద్ద పంచాంగాలు పంచి పెట్టారు. గుంటి గంగ వద్ద ఆర్‌పీ శ్రీనివాసరావు పంచాంగాలు పంచిపెట్టారు. తాళ్లూరులో ప్రసాద్ పంతులు పంచాంగ శ్రవణం చేశారు. తాళ్లూరులో ఉగాది పర్వదినాన వెంకట్రామయ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కొమరోలు: మండలంలో ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల్లో ప్రజలు వసంతోత్సవాలు నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా దేవాలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. తెలుగు సంప్రదాయాల ప్రకారం ప్రతి ఇంటా ఉగాది పచ్చడి చేసుకుని పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేశారు.

ముండ్లమూరు: శోభకృత్ నామ తెలుగు సంవత్సరం సందర్భంగా ఉగాది వేడుకలు బుధవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు భక్తుల పేరు బలాల మీద జరిగే మంచి చెడులు తెలియజేస్తూ పంచాంగ పఠనం చేశారు. ఈ ఏడాది అంతా పాడి పంటలతో అన్ని వర్గాలకు మంచే జరగాలని కోరుతూ పండితులు ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దదోర్నాల: శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని మండలంలో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. షడ్రుచుల సమ్మేళనంతో నూతన సంవత్సర సంబరాలు గ్రామ గ్రామాల్లో అంబరాన్నంటాయి. పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలోని పలు దేవాలయాలు భక్తజనంతో పోటెత్తాయి. నూతన సంవత్సరంలో శుభం కలగాలనీ వందలాది మంది భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీపార్వతీ సమేత చెన్నమల్లేశ్వర స్వామి దేవాలయంలో ఉగాది పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉగాది సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌ను వెండి ఆభరణాలు, పరిమళ పుష్పాలతో శోభయమానంగా అలంకరించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం వేకువ జాము నుంచే స్వామి వారిని ఆలయ అర్చకులు కొండవీటి సుదర్శనచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి సహస్రనామార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరించిన వాహనంలో పురవీధుల నుంచి ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించారు. పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్న రైతులు ఆయా గ్రామాల్లో జరిగిన ఏరువాక ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏరువాక చేసేందుకు కాడెద్దులను ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు చేశారు. ఏరువాక అనంతరం మూడు రోజుల పాటు వ్యవసాయ పనులు నిర్వహించటం ఆనవాయితీ. ఏరువాక సందర్భంగా రైతులు నూతన దుస్తులతో పాటు వ్యవసాయ పనిముట్లకు పూజలు చేశారు.


ముండ్లమూరు: ఉల్లగల్లు ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


తర్లుపాడు వేణుగోపాల స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం


కొమరోలు: పంచాంగ శ్రవణం చేస్తున్న పండితుడు


గొట్లగట్టులో కాటంరాజు ఉత్సవం


పుల్లలచెరువు: ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న భక్తులు


పెద్దదోర్నాలలో ఏరువాక ఉత్సవంలో రైతులు

అమృత కంటి ఆస్పత్రి ప్రారంభం

- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే కేపీ, జంకె

పొదిలి రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అమృత కంటి ఆస్పత్రి యాజమాన్యానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సూచించారు. బుధవారం పొదిలి పట్టణంలోని విశ్వనాథపురంలో వైఎస్సార్ రెడ్డినగర్‌కు ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన అమృత కంటి ఆస్పత్రిని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డితో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. తొలుత ముఖ్యఅతిథులకు ఆస్పత్రి డైరెక్టర్లు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. జిల్లా నడిబొడ్డున అత్యాధునిక సదుపాయాలతో ఆసుపత్రి ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సేవభావంతో తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రజలకు వైఎస్సార్ సీపీ తరఫున శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, డైరెక్టర్లు వరికూటి భరత్, వరికూటి అమృత పాణి, జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ కె.బేబీరాణి, పీఆర్ డీఈ శ్రీధర్‌రెడ్డి, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, పొదిలి మండల, పట్టణ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్‌బేగం, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, ముల్లా జాకీర్ తదితరులు పాల్గొన్నారు.


అమృత కంటి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, కేపీ నాగార్జునరెడ్డి, జంకె వెంకటరెడ్డి

కాటంరాజు తిరునాళ్ల ప్రశాంతం

మార్కాపురం టౌన్: పెద్దరావీడు మండలంలోని గుండంచర్ల వద్ద అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న కాటంరాజు స్వామి తిరునాళ్ల భక్తులు, పోలీసులు, అధికారుల సహకారంతో ప్రశాంతంగా ముగిసిందని ఆలయ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానానికి రూ.4 లక్షలు వెచ్చించినట్లు చెప్పారు. వివాదాలకు తావివ్వకుండా బందోబస్తు నిర్వహించిన ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, భక్తులకు అసౌకర్యం లేకుండా బస్సులు నడిపిన ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు గంగుల ఎల్లయ్య, ముంగమూరి పోలయ్య, నాగేశ్వరరావు, పల్లెబోయిన వెంకటరాజు, గంగరాజు, గురుప్రసాద్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవలకు పురస్కారం అభినందనీయం

- డీఎస్పీ డాక్టర్ కిషోర్‌కుమార్
- పలువురికి ఉగాది పురస్కారాలు ప్రదానం

మార్కాపురం టౌన్: సేవలకు గుర్తింపుగా ఉగాది పురస్కారాలు అందజేయడం అభినందనీయమని డీఎస్పీ డాక్టర్ ఎం.కిషోర్ కుమార్ పేర్కొన్నారు.స్థానిక సాయి బాబా మందిరం ఆధ్వర్యంలో గత రెండు దశాబ్దాలుగా వివిధ రంగాల్లో సేవలందించిన పలువురికి మందిరం కార్యదర్శి గోపాలుని హరిహరరావు ఆధ్వర్యంలో బుధవారం ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సమాజా సేవ చేసే వారిని గుర్తించి సత్కరించడం సంతషకరమన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ మాట్లాడుతూ.. తెలుగు వారి సంస్కృతిని ప్రతిబింబించే ఉగాది రోజున ప్రముఖులను సన్మానించడం అభినందనీయమన్నారు. మందిరం కార్యదర్శి హరిహరరావు మాట్లాడుతూ గడిచిన 25 సంత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మొదటి సారిగా ఈ ఏడాది నుంచి విశిష్ట సేవలందించిన వారిని సన్మానిస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా సేవ కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, డాక్టర్ శ్రీనివాస శాస్త్రి, జీఎల్ నరసింహారావు, గుంటక వనజాక్షి, ప్రతిమ, రాంగోపాల్, డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి తదితరులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. తొలుత పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, ఆడిటర్ నాగరాజు, గోపాలుని కృష్ణమోహన్, కాశంరాజు రామకృష్ణ, జల్లెల్ల వెంకటేశ్వర్లు, ముస్కాన్, కరీం, మహిళా సేవా సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

సత్సంగ సమితి ఆధ్వర్యంలో..

షిర్డీ సాయి సత్సంగ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఆర్.రామచంద్రరావు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంచి నీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. పలువురికి గొడుగులు, పాదరక్షలు, దుస్తులు అందించారు.


డీఎస్పీని సన్మానిస్తున్న హరిహరరావు, పక్కన మున్సిపల్ చైర్మన్ కృష్ణ

2న భార్యాభర్తలు, అత్తాకోడళ్లకు అవగాహన సదస్సు

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది గ్రామంలో బైబిల్‌మిషన్ ఆధ్వర్యంలో మే 2వ తేదీ భార్యాభర్తలు, అత్తాకోడళ్లకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు గుంటూరు బైబిల్ మిషన్ గవర్నింగ్ బాడీ మెంబర్, ప్రకాశం జిల్లా ఇన్‌చార్జ్ రెవ.ఆర్.ఎం.పి.ప్రభాకర్‌కుమార్ తెలిపారు. నేటి సమాజంలో చిన్న చిన్న సమస్యలకే కుటుంబ కలహాలు, ఎదుటివారి కంటే తాము అధికులమనే భావన, ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడం, అత్త పెత్తనం చెలాయించడం, కోడలు అత్తలో తన తల్లిని చూసుకోలేకపోవడం వంటి వాటి వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కరవది అంబేడ్కర్ నగర్‌లోని బైబిల్ మిషన్ దేవాలయం ఫస్ట్‌ఫ్లోర్‌లో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 27వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.